క్లుప్తంగా

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



నున్న(విజయవాడ రూరల్): వికాస్ కాలేజీ రోడ్డులోని చినకంచి సమీప పొలాల్లో విద్యుత్ స్తంభం పూర్తిగా ఒరిగి ప్రమాదకరంగా దర్శనమిస్తోంది. స్తంభం పక్కకు ఒరగడంతో విద్యుత్ తీగలు చెట్లను తాకుతున్నాయి. దీంతో అటుగా వెళ్లే పాడి గేదెలు, దూడలకు ఏమైనా ప్రమాదం జరుగుతుందేమోనని రైతులు భయాందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాన్ని, విద్యుత్ తీగలను సరి చేయాలని రైతులు, గ్రామస్తులు కోరుతున్నారు.

డెమోక్రటిక్ పీఆర్‌టీయూ జిల్లా కౌన్సిలర్‌గా సరళ



గన్నవరం రూరల్: డెమోక్రటిక్ పీఆర్‌టీయూ జిల్లా కౌన్సిలర్‌గా వీరపనేనిగూడెం ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎం సరళ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎంవీఎస్ నాగేంద్రరావు అధ్యక్షతన గురువారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సరళను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నాగేంద్రరావు ప్రకటించారు. ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించడంలో కృషి చేయాలని ఆయన సరళకు సూచించారు. మండల శాఖ అధ్యక్షుడు నాయక్, ప్రధాన కార్యదర్శి రాజేష్, గోపి, నాగేశ్వయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు ఈకేవైసీ తప్పనిసరి

విజయవాడ రూరల్: మండలంలోని ఉపాధి కూలీలు తమ ఆధార్ కార్డులకు ఈకేవైసీ చేయించాలని ఎంపీడీవో బి.విగ్గీన్స్ ఒక ప్రకటనలో తెలిపారు. జాబ్ కార్డులు కలిగి ఉపాధి పనులకు వెళ్లే వారు సైతం తమ ఆధార్ కార్డులకు ఆయా గ్రామాల్లోని యానిమేటర్ల వద్ద ఈకేవైసీ చేయించుకోవాలన్నారు.

ఆదర్శ కమ్యూనిస్టు పాలడుగు వెంకటరత్నం



గన్నవరం రూరల్: ఆదర్శ కమ్యూనిస్టు పాలడుగు వెంకటరత్నం అని వక్తలు కొనియాడారు. గురువారం సావరగూడెం గ్రామంలో వెంకటరత్నం సంస్మరణ సభ సీపీఎం మండల కార్యదర్శి మల్లంపల్లి ఆంజనేయులు అధ్యక్షతన నిర్వహించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. నమ్మిన సిద్ధాంతం కోసం జీవితాంతం పని చేసిన వెంకటరత్నం మార్గం అనుసరణీయమని వివరించారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర నాయకులు వై.కేశవరావు, జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు, డివిజన్ కార్యదర్శి కళ్లం వెంకటేశ్వరరావు, ప్రజానాట్య మండలి నాయకులు రామినేని రవిబాబు, రంగారెడ్డి, కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

రివిట్ సాఫ్ట్‌వేర్‌కు అధిక ప్రాధాన్యత



పెనమలూరు: సివిల్ ఇంజినీరింగ్‌లో రివిట్ సాఫ్ట్‌వేర్‌కు చాలా ప్రాధాన్యత ఉందని క్యాడ్ డైరెక్టర్ కేఎల్ఎస్ ప్రసాద్ తెలిపారు. కానూరు పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో సివిల్ విభాగం ఆధ్వర్యంలో రివిట్ సాఫ్ట్‌వేర్‌పై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సివిల్ రంగంలో వస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులు దృష్టి పెట్టాలన్నారు. సివిల్ విభాగాధిపతి డాక్టర్ వి.జగదీష్ మాట్లాడుతూ.. సాఫ్ట్‌వేర్ నైపుణ్యం పెంపొందించుకోవడానికి ఈ శిక్షణ చేపట్టామన్నారు. ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కోగంటి శ్యామ్‌ప్రకాష్, విద్యార్థులు పాల్గొన్నారు.

లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం సేకరణ

కంకిపాడు: లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం సేకరణ జరపాలని తహసీల్దార్ వి.భావనారాయణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఖరీఫ్ ధాన్యం సేకరణ ప్రక్రియపై గురువారం అవగాహనా సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. పౌర సరఫరాల శాఖకు నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా మండలం వ్యాప్తంగా ధాన్యం సేకరణ జరగాలన్నారు. సివిల్ సప్లయిస్ అధికారులు ధాన్యం సేకరణ, తేమ శాతం పరిశీలన ప్రక్రియపై టెక్నికల్ అసిస్టెంట్‌లకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో రైతులు, మిల్లర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నిర్మాణం నత్తనడకన.. ప్రయాణం నరకయాతన

- ముందుకు కదలని కానూరు డ్రెయిన్ నిర్మాణ పనులు
- గ్రామంలోకి రాని సిటీ బస్సులు
- తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న స్థానికులు

పెనమలూరు: తాడిగడప మున్సిపాలటీ పరిధి కానూరులో గ్రామ ప్రధాన రహదారి ఇరువైపులా డ్రెయిన్ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. డ్రెయిన్ నిర్మాణ పనులు చేపట్టి దాదాపు మూడు నెలలు గడుస్తున్నా పనులు ఇంకా పూర్తికాలేదు. దీంతో గ్రామంలో రాకపోకలకు నరకయాతన పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. కామయ్యతోపు నుంచి కానూరు శివారు వరకు గ్రామ ప్రధాన రహదారి విస్తరించి ఉంది. ఇటీవల కాలంలో భవనాల నిర్మాణం బాగా జరగడంతో గ్రామంలో డ్రెయిన్ సమస్య తీవ్రంగా మారింది. గ్రామంలో సరైన డ్రెయిన్ లేకపోవడంతో వర్షం పడితే రోడ్డుపై మురుగు చేరి ప్రజలు నడవలేని పరిస్థితి ఏర్పడుతుంది.

నిర్మాణ పనులకు రూ.3 కోట్ల అంచనా..

గ్రామ ప్రధాన రహదారి ఇరువైపులా డ్రెయిన్ నిర్మాణం చేయడానికి రూ.3 కోట్లతో తాడిగడప మున్సిపాలటీ అంచనాలు వేసింది. సీఆర్డీయే, 15వ ఆర్థిక సంఘ నిధులు, మున్సిపాలటీ జనరల్ ఫండ్స్‌తో డ్రెయిన్ నిర్మాణ పనులను గత మూడు నెలల కిందట ప్రారంభించారు. కాగా పనులు మాత్రం నేటికీ పూర్తికాలేదు. ప్రణాళిక లేకుండా పనులు చేయడంతో ఎక్కడి పనులు అక్కడే అసంపూర్తిగా మిగిలిపోయాయి. పనుల్లో భాగంగా రోడ్డుకు అడ్డుగా సిమెంట్ పైపులు వేసి రాకపోకలు నిషేధించారు. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామ ప్రజలు వాపోతున్నారు.

పనుల్లో పర్యవేక్షణ కరువు..

డ్రెయిన్ నిర్మాణ పనుల విషయంలో అధికారులు,



కానూరు ప్రధాన రహదారికి అడ్డంగా వేసిన సిమెంట్ పైప్‌లు

స్థానిక నాయకుల నిర్లక్ష్యంతోనే సమస్య తలెత్తిందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పలు నాయకుల బినామీలు కాంట్రాక్టు పనులు చేస్తున్నారని.. చేస్తున్న పనులు క్రమపద్ధతి లేకుండా రోడ్డు పక్కన ఎక్కడ పడితే అక్కడ తవ్వకాలు చేపట్టి పనులను పూర్తి చేయకుండా ఉంచారన్న వాదనలు వినిపిస్తున్నాయి. నిర్మాణ పనులు ఒకదాని తరువాత ఒకటి బిట్లు వారిగా కాకుండా ఇష్టానుసారం జరుగుతున్నాయని.. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తిందని గ్రామస్తులు చెబుతున్నారు.

సిటీ బస్సుల రాకపోకలు బంద్..

డ్రెయిన్ నిర్మాణ పనుల కారణంగా గ్రామంలోకి సిటీ బస్సుల రాకపోకలను బంద్ చేశారు. దీంతో బస్సులు పెట్రోల్ బంక్ వద్దకు వచ్చి తిరిగి వెళుతున్నాయి. చేసేదేమీ లేక పెట్రోల్ బంక్ నుంచి మూడు ఫర్లాంగులు నడవాల్సి వస్తోందని గ్రామస్తులు చెబుతున్నారు. ప్రధాన రహదారి సైతం పూర్తిగా దెబ్బతిందని.. నడిచి వెళ్లడానికి కూడా అనువుగా లేదని.. ఆటోలు సైతం తిరిగే పరిస్థితి లేకుండా రోడ్డు ఉందని ప్రజలు వాపోతున్నారు. పలు కారణాల వల్ల పనుల్లో జాప్యం జరిగిందని..



డ్రెయిన్ నిర్మాణానికి రోడ్డు పక్క తవ్వి వదిలేసిన గుంత

వీలైనంత త్వరగా పనులు పూర్తి చేస్తామని తాడిగడప మున్సిపాలటీ కమిషనర్ షేక్ నజీర్ తెలిపారు.

మార్కెట్‌లోకి ది ఆల్ న్యూ గ్రాండ్ 'విక్టోరిస్'

పెనమలూరు: కానూరు సంతోష్ మారుతీ సుజుకీ షోరూమ్‌లో గురువారం మారుతీ సుజుకీ విక్టోరిస్ కారును మార్కెట్‌లోకి విడుదల చేశారు. గొల్లపూడి కమర్షియల్ మార్కెట్ అధ్యక్షుడు పి.నాగేశ్వరరావు, ఎస్‌బీఐ ఆర్‌ఎం రాచపూడి రాఘవరావు విక్టోరిస్‌ను ఘనంగా ఆవిష్కరించారు. ఆర్‌ఎం రాఘవరావు మాట్లాడుతూ.. వినియోగదారుల కోసం విక్టోరిస్‌కు ఎస్‌బీఐ 100 శాతం ఆన్‌రోడ్ ఫండింగ్ ఫైనాన్స్ సదుపాయం కల్పిస్తుందన్నారు. సంతోష్ మారుతీ సుజుకీ షోరూమ్ మేనేజింగ్ డైరెక్టర్ చుక్కపల్లి శ్రీకాంత్ మాట్లాడుతూ.. విక్టోరిస్ మూడు వేరియంట్‌లలో ఉందన్నారు. హైబ్రీడ్, స్మార్ట్ హైబ్రీడ్, సీఎన్‌జీలు బుకింగ్‌లు చేసుకోవచ్చని వివరించారు. సంతోష్ మారుతీ సీవో జి.శ్యామ్‌కుమార్ మాట్లాడు



విక్టోరిస్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్‌బీఐ ఆర్‌ఎం రాఘవరావు

తూ.. భారత్ ఎన్‌కాప్ రేటింగ్‌లో 5 స్టార్ వచ్చిందని, తమ వద్ద ఇప్పటికీ 100కు పైగా కార్లు బుకింగ్స్ వచ్చాయని, డెలివరీ ప్రారంభించామని తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖులు, వినియోగదారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అధిక పోషకాలను ఆహారంగా తీసుకోవాలి

గన్నవరం: ఉంగుటూరు మండలం తేలప్రోలు గ్రామంలో గురువారం ఐసీడీఎస్ గన్నవరం ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో గ్రామ స్థాయిలో పోషణ మాసోత్సవం నిర్వహించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉండే ఆహారం తయారీపై బాలింతలు, గర్భిణులకు అవగాహన కల్పించారు. అనంతరం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి.పద్మాదేవి మాట్లాడుతూ.. అధిక పోషక విలువలు ఉండే మిల్లెట్లు, ఆకుకూరలను ఆహారంలో ఎక్కువగా తీసుకోవాలని వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సరఫరా చేసే పౌష్టికాహారాన్ని సక్రమంగా వినియోగించుకోవాలని కోరారు. పిల్లల్లో స్థూలకాయం నివారణకు చక్కెర, నూనె వినియోగం తగ్గించాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది ఎం.షారోన్, పుష్ప, ఎం.రత్నకుమారి, పి.విమల, ఎస్‌వీవీ సుధారాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ పద్మాదేవి

తల్లీబిడ్డలకు పోషకాహారంతోనే ఆరోగ్యం

పెనమలూరు: తల్లీబిడ్డలు పోషకాహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.విజయలక్ష్మి అన్నారు. 8వ రాష్ట్రీయ పోషణ మాసం-2025 కార్యక్రమాలు గురువారంతో ముగిశాయి. ఈ సందర్భంగా కానూరు తులసీనగర్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు ర్యాలీ నిర్వహించారు. చిన్నారులకు బాల్య దశ సంరక్షణ, విద్య, ఆహారపు అలవాట్లపై తల్లులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు. వణుకూరులో నిర్వహించిన పోషణ మాసం ముగింపు కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొని ర్యాలీ చేపట్టారు. జంక్‌ఫుడ్ తీసుకోవడం వల్ల పిల్లలకు ఊబకాయం వస్తుందని మహిళా సంరక్షణ కార్యదర్శి ఎం.సంఘమైత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, చిన్నారులు పాల్గొన్నారు.



కానూరు ర్యాలీలో పాల్గొన్న సూపర్‌వైజర్ విజయలక్ష్మి

క్రీడాకారులు అకుంటిత దీక్షతో సాధన చేయాలి



శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న రవీంద్రనాథ్

గన్నవరం: సౌత్‌జోన్ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర మహిళా ఖోఖో జట్టుకు స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో గురువారం శిక్షణ శిబిరం నిర్వహించారు. తొలుత ఈ శిబిరాన్ని రాష్ట్ర క్రీడా సంస్థ సభ్యులు పేరం రవీంద్రనాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఖోఖో రాష్ట్ర మహిళా జట్టు అకుంటిత దీక్షతో సాధన చేసి సౌత్ జోన్ పోటీల్లో పతకం సాధించాలని సూచించారు. ప్రతిభావంతులైన క్రీడాకారులను ప్రభుత్వం పోత్సాహిస్తుందన్నారు. క్రీడాకారులకు ఉన్నత విద్య, ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కోటా కింద మూడు శాతం రిజర్వేషన్ కల్పిస్తున్నట్లు వివరించారు. ఈనెల 24వ తేదీ నుంచి 26వ తేదీ వరకు కర్ణాటకలోని దావణగిరిలో జరిగే సౌత్‌జోన్ పోటీలకు రాష్ట్ర జట్లను సమయత్తం చేస్తున్నట్లు ఆంధ్ర ఖోఖో అసోసియేషన్ అధ్యక్షులు టీఎస్ఆర్‌కే ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎండీ గౌసాని, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కేవీఆర్ కిషోర్, పాఠశాల హెచ్‌ఎం ఎ.సునీల, పాఠశాల క్రీడా సమాఖ్య కార్యదర్శి జి.రాంబాబు, పీఈటీ డి.నాగరాజు, ఖోఖో శిక్షకులు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకం సామాజిక బాధ్యత

ఉయ్యూరు: మొక్కల పెంపకం సామాజిక బాధ్యతగా తీసుకోవాలని మాజీ మంత్రి వడ్డె శోభనాద్రీశ్వరరావు అన్నారు. ఉయ్యూరు జెడ్పీ పాఠశాలలో గుళ్లపల్లి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని మాజీ మంత్రి వడ్డె గురువారం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు మొక్కలను పెంచడమే ప్రత్యామ్నాయమన్నారు. విద్యార్థులకు చిన్నతనం నుంచే మొక్కలను పెంచి సంరక్షించే బాధ్యతను అలవాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. పెరుగుతున్న వాతావరణ కాలుష్యం, వాతావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులపై అవగాహన కల్పిస్తూ మొక్కల పెంపకం ఆవశ్యకతను విస్తృతంగా తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు.



కార్యక్రమంలో మాజీ మంత్రి వడ్డె శోభనాద్రీశ్వరరావు

కార్యక్రమంలో హెచ్‌ఎం టీవీ నాగేశ్వరరావు, డాక్టర్ జితేంద్ర ప్రసాద్, కార్టూనిస్ట్ హరికృష్ణ, ప్రసాద్, విష్ణు సేవా సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

జంతు సంక్రమిత వ్యాధులపై అప్రమత్తత అవసరం

గన్నవరం: జంతు సంక్రమిత వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకులు డాక్టర్ చంద్రమోహన్ పశు వైద్య సిబ్బందికి సూచించారు. స్థానిక ఎన్టీఆర్ పశు వైద్య కళాశాలకు చెందిన చికిత్సాలయంలో గురువారం జాన్ హోప్ కిన్స్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో జంతు సంక్రమిత వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెంపుడు జంతువుల నుంచి అనేక వ్యాధులు మనుషులకు సంక్రమించే ప్రమాదం ఉందన్నారు. వీటిలో కుక్కల నుంచి సంక్రమించే రేబీస్ వ్యాధి ప్రాణాంతకరమైనదని వివరించారు. ఈ వ్యాధుల బారిన పడకుండా పాడి రైతులు, పెంపుడు జంతువుల యాజమానులను అప్రమత్తం చేయాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ సొహైల్ అహ్మద్, డాక్టర్ రాజీవ్, డాక్టర్ సుధీర్‌బాబు, ఏడు మండలాలకు చెందిన 60 మంది పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్డీయే పాలనలో ముస్లింలకు అన్యాయం

పెనమలూరు: ఎన్డీయే పాలనలో ముస్లింలకు తీరని అన్యాయం జరుగుతుందని ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా అన్నారు. యనమలకుదురులో ఆయన గురువారం ముస్లిం సంఘ నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్డీయే పాలనలో ముస్లింలకు సంక్షేమ పథకాలు అమలు జరగడం లేదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మౌలానానసీర్ ఆలీ, రాష్ట్ర అధికార ప్రతినిధి సిలార్బేగ్, ఎండీ జానీ, పాల్గొన్నారు. ఆజాద్ ముస్లిం కమిటీ పెనమలూరు నియోజకవర్గ అధ్యక్షుడిగా షేక్ అబ్బాస్‌ను రాష్ట్ర కమిటీ నియమించింది. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు నాగుల్‌మీరా నియామక



అబ్బాస్‌కు నియామక పత్రం అందజేస్తున్న నాగుల్‌మీరా

పత్రాన్ని షేక్ అబ్బాస్‌కు గురువారం యనమలకుదురులో అందజేశారు. సేవా భావం కలిగిన వ్యక్తులు తమ కమిటీలో చేరాలని నాగుల్‌మీరా కోరారు.

సంక్షిప్త వార్తలు

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



ఉయ్యూరు: నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పని ఉయ్యూరు ఆర్డీవో హెలా షారోన్ హెచ్చరించారు. దీపావళి టపాసుల దుకాణాలు ఏర్పాటు చేసే వీరమ్మతల్లి ఆలయ ప్రాంగణాన్ని గురువారం ఆమె పరిశీలించారు. దుకాణదారులు, ఆలయ కమిటీ ప్రతినిధులు, ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్షించారు. ఆర్డీవో హెలా షారోన్ మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా దుకాణాలు ఏర్పాటు చేయాలన్నారు. దుకాణాల ఏర్పాటుపై విద్యుత్, అగ్నిమాపక, మున్సిపల్, రెవెన్యూ శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. లైసెన్సు లేకుండా దుకాణాలు ఏర్పాటు చేస్తే చట్టప్రకారం చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్‌బాబు, కమిషనర్ జాస్తి రామారావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఏఐ శిక్షణకు విద్యార్థుల ఎంపిక

పెనమలూరు: గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీకి చెందిన 22 మంది బీటెక్ విద్యార్థులు ఏఐ శిక్షణకు ఎంపికయ్యారు. కాలిబో సంస్థ, వట్టికూటి ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రాజ్ వట్టికూటి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఏడాది పాటు ఏఐపై ఉచిత శిక్షణ ఇస్తారు. 241 మంది విద్యార్థులకు గానూ 22 మంది విద్యార్థులు శిక్షణకు అర్హత సాధించారని ప్రిన్సిపాల్ డాక్టర్ కడియాల రవి గురువారం తెలిపారు. కార్యక్రమంలో కాలిబో సంస్థ సీఈవో స్కాట్, కాలేజీ అకాడమిక్ డైరెక్టర్ రవిప్రసాద్, ప్రముఖ నిపుణులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



రామవరప్పాడు: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని ఎస్ఆర్‌కే కళాశాల ప్రిన్సిపాల్ కె.రమేష్‌బాబు అన్నారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడు ఎస్ఆర్‌కే ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 'మేరా యువ భారత్ మై భారత్' కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా బ్లాక్ లెవల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించి విద్యార్థులకు వాలీబాల్, షాట్ పుట్ బాల్, రన్నింగ్, కబడ్డీ వంటి పలు ఆటల పోటీలను నిర్వహించారు. అనంతరం పురుషులు, మహిళా విభాగాల్లో రన్నర్స్, విన్నర్స్‌కు బహుమతులతో పాటు సర్టిఫికేట్లు అందజేశారు. కార్యక్రమంలో పలు విభాగాల అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆఫీసర్ చిన్ని, ఫిజికల్ డైరెక్టర్ శరత్‌బాబు పాల్గొన్నారు.

జాన్‌పాడు దర్గాహ్ ఉత్సవాలు

గన్నవరం రూరల్: మండలంలోని కొండపావులూరులో జాన్‌పాడు షహీదా వలి దర్గాహ్ షరీఫ్ జెండాల పండుగను ముస్లిం సోదరులు బుధవారం రాత్రి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

విద్యార్థుల సంక్షేమంపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలి



గన్నవరం రూరల్: మండలంలోని వీరపనేనిగూడెం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను గురువారం సర్పంచ్ ఆరేపల్లి జేజమ్మ, ఆత్కూరు పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ అంకూరి నాగమల్లేశ్వరరావు సందర్శించారు. పాఠశాలలో భోజనశాల, వాటర్ ప్లాంట్, విద్యార్థులకు అందిస్తున్న ఆహారాన్ని వారు పరిశీలించారు. పారిశుద్ధ్యం పట్ల జాగ్రత్తలు చేపట్టాలన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్ సురేష్, పాఠశాల హెల్త్ సూపర్‌వైజర్ జ్యోతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రవాణా రంగానికి సూపర్ జీఎస్టీ బహుమతి



పెనమలూరు: రవాణా రంగానికి సూపర్ జీఎస్టీ మంచి బహుమతి అని ఉయ్యూరు డివిజన్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ పీవీఎస్ సుబ్బారావు అన్నారు. గురువారం తాడిగడప మున్సిపాలటీ పరిధిలోని తాడిగడప జంక్షన్‌లో రవాణా రంగానికి సూపర్ జీఎస్టీ 2.0 ఉపయోగంపై ర్యాలీ నిర్వహించి ఆయన అవగాహన కల్పించారు. సుబ్బారావు మాట్లాడుతూ.. జీఎస్టీ సంస్కరణలు రవాణా రంగం, లాజిస్టిక్స్‌కు ఎంతో మేలు చేసిందన్నారు. వాహనాల కొనుగోలు, నిర్వహణ ఖర్చు తగ్గిందన్నారు. అలానే పన్ను రేట్లు హేతుబద్ధీకరణ, పూర్తి సామర్థ్యంతో సేవలు అందుతాయన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌కమిటీ చైర్మన్ కొండా ప్రవీణ్, బ్రేక్ ఇన్‌స్పెక్టర్ షేక్.ఆయేషా ఉస్మాని, ట్రాఫిక్ పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

బధిరుల పాఠశాలకు సరుకుల వితరణ

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక నూజివీడు రోడ్డులోని ఆదిత్య బధిరుల విద్యాలయానికి ప్రవాసాంధ్రుడు మునగాల రవికుమార్ రూ.20 వేలు విలువ గల నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ హనుమాన్‌జంక్షన్ ఆధ్వర్యంలో రవికుమార్ మిత్రుడు మత్తి రాంబాబు గురువారం ఈ సరుకులను ఆదిత్య ప్రిన్సిపాల్ ఆకుల వెంకటరమణకు అందించారు.

చిన్నారుల్లో ఉబకాయాన్ని నివారించాలి

ఉయ్యూరు రూరల్: చిన్నారుల్లో ఉబకాయాన్ని నిర్మూలించేలా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బేబీ సరోజిని సూచించారు. 8వ రాష్ట్రీయ పోషణ్ మాస ఉత్సవాల ముగింపు కార్యక్రమం మండలంలోని చిన్న ఓగిరాల అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో చిన్నారులకు చేతివేళ్ల ద్వారా శుభ్రతపై అవగాహన కల్పించారు. సరోజినీ మాట్లాడుతూ.. ఉబకాయం గల చిన్నారులు, వ్యక్తులు ప్రాణాంతకమైన గుండె జబ్బులు, క్యాన్సర్, మధుమేహం, రక్తపోటు వంటి వ్యాధులకు గురై జీవితాంతం ఇబ్బంది పడే పరిస్థితి ఉంటుందన్నారు. కాబట్టి ఉబకాయాన్ని మొదటి నుంచే చిన్నారులకు దూరం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం లత, అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రతిభ, శాంత కుమారి, నాగలక్ష్మి, ఆశా కార్యకర్తలు, తల్లులు, లబ్ధిదారులు పాల్గొన్నారు. మండలంలోని ముదునూరు అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో స్థానిక వెల్నెస్ సెంటర్ సీహెచ్‌వో ప్రత్యూష పాల్గొని సీపీఆర్‌పై మాట్లాడారు. మహిళా సంరక్షణ కార్యదర్శి నాగలక్ష్మి, సూపర్‌వైజర్ బేబీ సరోజిని, అంగన్‌వాడీ కార్యకర్తలు సీహెచ్ విజయలక్ష్మి, ఝాన్సీ రాణి, చుక్కమ్మ, డి.విజయలక్ష్మి, అరుణ కుమారి, ఆశా కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

పంక్తి భోజనాల్లో ఘర్షణ

ఘర్షణలో రెచ్చిపోయిన టీడీపీ యువత

సాక్షి, టాస్క్‌ఫోర్స్: భోజనాల వద్ద తలెత్తిన ఘర్షణలో టీడీపీ యువత రెచ్చిపోయింది. గురువారం జరిగిన ఘటనపై బాధితులు పోలీసులను ఆశ్రయించారు. బాధితుల కథనం మేరకు.. మండలంలోని కందలంపాడు గ్రామంలో ఓ ఇంటి వద్ద జరిగే భోజనాల కార్యక్రమానికి స్థానికులు హాజరయ్యారు. ఈ క్రమంలో ఓ స్థానికుడు తన కుటుంబ సభ్యులు కోసం భోజనాలు చేసేందుకు కుర్చీలు ఆపారు. ఈ విషయంలో తలెత్తిన వివాదంలో గ్రామానికి చెందిన టీడీపీ శ్రేణులు నలుగురు ఆ స్థానికుడితో ఘర్షణకు దిగారు. గొడవను గుర్తించిన అతని భార్య, వదినలు గొడవను ఆపేందుకు యతించారు. ఈ క్రమంలో టీడీపీ యువత స్థానికుడిపై దాడిచేయటంతో పాటు ఆ మహిళలను దూషించారు. వారి పట్ల అసభ్యంగా ప్రవర్తించారు. దీంతో బాధితులు కంకిపాడు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. గతంలోనూ పలుమార్లు టీడీపీ శ్రేణులు బెదిరింపులకు పాల్పడ్డారని.. పోలీసులు తగు చర్యలు తీసుకోవాలని మహిళలు డిమాండ్ చేశారు.

ప్రారంభమైన బాలయేసు దేవాలయ వార్షికోత్సవం

గన్నవరం: స్థానిక అద్భుత బాలయేసు దేవాలయ వార్షికోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలుత బాలయేసు పతాకాన్ని వికార్ జనరల్, క్యాథలిక్ సెంటర్ డైరెక్టర్ రెవ. మోన్సిఞ్జోర్ మెసపం గాబ్రియేలు ఆవిష్కరించారు. అనంతరం జపమాల, దివ్యబలి పూజ, దివ్యసత్ప్రసాద ఆశీర్వాద కార్యక్రమాలను నిర్వహించారు. బాలయేసు గాయక బృందం ఆలపించిన భక్తి గీతాలు విశ్వాసులను ఆకట్టుకున్నాయి. విచారణకర్తలు రెవ. ఫాదర్ పసల థామస్ మాట్లాడుతూ.. దేవాలయ వార్షికోత్సవంలో భాగంగా ఈనెల 24వ తేదీ వరకు నవదిన ప్రార్థనలు జరుగుతాయని తెలిపారు. 25న గన్నవరం పురవీధుల్లో మరియమాత స్వరూప ప్రదక్షణ, 26న సమష్టి దివ్యబలి పూజ జరుగుతుందన్నారు. విచారణ పరిధిలోని విశ్వాసులు హాజరుకావాల్సిందిగా కోరారు. విచారణ కౌన్సిల్‌కు చెందిన కాటం కిషోర్, పసల రత్నం తదితరులు పాల్గొన్నారు.



బాలయేసు పతాకావిష్కరణ చేస్తున్న గాబ్రియేలు

ఘనంగా ప్రపంచ ఆహార దినోత్సవం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): స్థానిక వీర మాచినేని పద్దయ్య సిద్ధార్థ పబ్లిక్ స్కూల్‌లో ప్రపంచ ఆహార దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. 'నిప్పు లేకుండా వంట' అనే పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. రెండో తరగతి చిన్నారులు వారి తల్లులతో కలిసి పోషక విలువలతో కూడిన వివిధ రకాల ఆహార పదార్థాలు సిద్ధం చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ మేడా సీతారామయ్య తదితరులు చిన్నారులు చేసిన ఆహార పదార్థాలను రుచి చూసి వారిని అభినందించారు.